సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 10 । అక్టోబర్ । 2024



సోమశిలలో 53.037 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 53.037 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 8,700 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 2 వేలు, ఉత్తరకాలువకు 540, దక్షిణకాలువకు 8,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.77,230
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,030
3 శాతం జీఎస్టీతో	రూ.7,241
నవర (8గ్రా)	రూ.57,928

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.8 /26.4

జిల్లాలో గురువారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉంటాయి. బుధవారం గాలిలో తేమ 69 శాతం ఉంది.

న్యూస్‌రీల్

పొట్టేళ్ల పిల్లల వేలం



పొట్టేలు పిల్లల విక్రయానికి వేలాన్ని నిర్వహిస్తున్న అధికారులు

కొండాపురం: మండలంలోని చింతలదేవిలో ఉన్న మిశ్రమ పశుగణాభివృద్ధి క్షేత్రంలో అధికారులు బుధవారం పొట్టేళ్ల పిల్లలకు డీడీ పెద్దిస్వామి వేలం నిర్వహించారు. మొత్తం 177 పొట్టేళ్ల పిల్లలకు వేలం నిర్వహించగా 75 పిల్లలను రైతులు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.7,84,120 వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.రమేష్ నాయక్, రామన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా విజయారాణి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు సిటీ: నెల్లూరులోని జిల్లా రిజిస్ట్రేషన్ ప్రాంతీయ కార్యాలయంలో జాయింట్ -1 సబ్ రిజిస్ట్రార్‌గా విజయారాణి ఇటీవల నియమితులైన విషయం తెలిసిందే. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లు శుభాకాంక్షలు తెలిపారు.

డీఎస్సీ కోచింగ్ శిక్షణా సంస్థలకు ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్సియల్ విధానంలో డీఎస్సీ కోచింగ్ ఇచ్చేందుకు అర్హత ఉన్న సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి డి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణా సంస్థలు, సాంఘిక, గిరిజన శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్‌ల్లో డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే సంస్థలు కనీసం రెండు డీఎస్సీల్లో శిక్షణ ఇచ్చి ఉండాలన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులు గత డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది ఉండాలన్నారు. 3 ఏళ్ల సగటు టర్నోవర్ కనీసం రూ.40 లక్షలు ఉండాలన్నారు. డీఎస్సీ ఎంపానెల్ ఎక్స్‌ప్రెస్ ఆఫ్ ఇన్‌ట్రెస్ట్ (ఈఓఐ)ను ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. ఆసక్తి ఉన్న శిక్షణా సంస్థలు డాక్యుమెంట్‌ను ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు నేరుగా సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

అవసరమైన కొత్త పనులు గుర్తించండి


- నవంబర్ 1లోపు ప్రారంభించాలి
- జెడ్పీ సీఈఓ మోహన్‌రావు



మాట్లాడుతున్న సీఈఓ మోహన్‌రావు

నెల్లూరు (పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసరమైన కొత్త పనులను గుర్తించి నవంబర్ 1వ తేదీ నుంచి వాటిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ నిధుల వివరాలను అందజేయాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులతో కొత్త పనులను ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. బస్టాండ్, ఆర్‌ఓ ప్లాంట్లు తదితర కొత్త పనులను చేపట్టాలన్నారు. గుర్తించిన పనులకు మండల అనుమతి తీసుకోవాలన్నారు. ఎంపీపీ, ప్రజాప్రతినిధుల సమక్షంలో పనులను గుర్తించి అనుమతులు తీసుకుని ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 22వ తేదీలోపు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గానికి రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల మేర నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. మండలాల వారీగా రూ.2 నుంచి రూ.3 కోట్లు నిధులు కేటాయించే అవకాశం ఉందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల మినహా ఈ నిధులతో కొత్త పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు కనిపించే పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. గుర్తించిన పనులకు మండల పరిషత్ తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ నెల 14 'పల్లెపండగ' కార్యక్రమం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అందుకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనుమతి లేకుండా సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

ఇసుకలో కాసుల వేట



దొండపాడు వద్ద మన్నేరులో ఇసుక తవ్వకాలు

కందుకూరు నియోజకవర్గంలో టీడీపీ నేతల నుంచి పోలీస్, రెవెన్యూ, మైనింగ్, రవాణాశాఖ అధికారుల వరకు ఇసుకలో కాసుల వేట సాగిస్తున్నారు. మన్నేరు, ఉప్పుటేరు నుంచి రేయింబవళ్లు ఇసుక రవాణా విచ్చలవిడిగా జరుగుతోంది. టీడీపీ నేతల ట్రాక్టర్లు అయితే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు ప్రతిపక్షం, ఇతరులు అయితే పట్టి కేసులు నమోదు చేస్తున్నారు. గుడ్లూరు పోలీసులు ఒక రోజే పది ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- మన్నేరు, ఉప్పుటేరు నుంచి విచ్చలవిడిగా రవాణా
- పట్టించుకోని పోలీస్, రెవెన్యూ అధికారులు
- టీడీపీ నేతల ట్రాక్టర్లు అయితే రైట్‌రైట్
- ఇతరులవైతే కేసులు నమోదు
- పాలూరు, దొండపాడు, గుండ్లపాలెం ఇసుకకు డిమాండ్

బడా నేతలకు భలే వనరు

ఇసుక అక్రమ రవాణాలో టీడీపీ బడా నేతలు రంగంలోకి దిగుతున్నారు. వెంకన్నపాళెం, పాలేరు నుంచి సుమారు 20 ఇసుక ట్రాక్టర్లను పట్టణ పరిధిలోని లుంబినివనం సమీపంలో ఉన్న ప్రాంతంలో డంప్ చేయిస్తున్నారు. అక్కడ నుంచి రాత్రి వేళల్లో టర్బో లారీలతో లోడింగ్ చేసి విక్రయిస్తున్నారు. అయితే ఇసుక ట్రాక్టర్లకు ఆ నాయకులు డబ్బులు ఇవ్వలేదని, ప్రస్తుతం ఇసుకను తోలకం నిలిపారు. మదనగోపాలపురం పరిధిలో ఓ మామిడి తోటలో ఇసుకను డంప్ చేశారు. అక్కడ ఒక వేళ వర్షాలు కురిసి మన్నేరులోకి వెళ్లే వీలు లేకపోతే డంపు చేసిన ఇసుకను విక్రయించేలా ప్రణాళికి సిద్ధం చేశారు.



మదనగోపాలపురం వద్ద ఓ మామిడి తోటలో డంప్ చేసిన ఇసుక

కందుకూరు రూరల్: నియోజకవర్గంలోని లింగసముద్రం, వలేటివారిపాళెం, గుడ్లూరు మండలాల పరిధిలో మన్నేరు, ఉప్పుటేరుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. కందుకూరు రూరల్, పట్టణ ప్రాంత పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా ట్రాక్టర్లు తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. పక్క మండలాల నుంచి ఇసుక తరలింపు కొంత మేర తగ్గడంతో పది రోజుల నుంచి ఇసుక ధరలు విపరీతంగా పెరిగాయి. కందుకూరు ప్రాంతంలో ఉన్న పాలూరు, దొండపాడు, మాచవరం గ్రామాల పరిధిలోని మన్నేరు, పలుకూరు పంచాయతీలోని వెంకన్నపాళెం వద్ద ఉన్న పాలేరు ఇసుకకు డిమాండ్ పెరిగింది.

టీడీపీ ట్రాక్టర్లపై కేసుల్లేవ్..

గత నెలలో ట్రక్కు ఇసుక రూ.2,500 నుంచి రూ.3,000 వరకు లభించేది. ప్రస్తుతం రూ.4 వేలకు పెరిగింది. అది కూడా కందుకూరు టౌన్ పరిధిలో అయితేనే. ఇంకా దూరం అయితే రూ.4,500 నుంచి రూ.5,000 వరకు చెల్లించాల్సి వస్తోంది. పాలూరు, దొండపాడు ఇసుక అయితే ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నాయి. గుడ్లూరు మండలం గుండ్లపాళెం, వలేటివారిపాళెం మండలం కళవళ్ల, లింగసముద్రం మండలం అన్నేబోయినపల్లి, వీఆర్ కోట, మన్నేరు నుంచి కావలి, పామూరు ప్రాంతాలకు ఇక్కడ నుంచి ఇసుక తరలిపోతోంది. అయితే టీడీపీ నేతలకు ఇది లాభ సాటిగా మారింది. దొండపాడు, పాలూరు గ్రామాలకు చెందిన అధికార పార్టీ ట్రాక్టర్లు మాత్రమే ఇసుకను తీసుకెళ్లేలా చక్రం తిప్పుతున్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందినవి.. లేదా ఇతరుల బండ్లు వస్తే వెంటనే పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. అధికార పార్టీ ట్రాక్టర్ల నంబర్లు ముందుగానే పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఎక్సైజ్ శాఖాధికారుల వద్ద ఉంచడంతో వాటి జోలికి వెళ్లడంలేదు. లేదా నంబర్లు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఒక ట్రాక్టర్‌కు నెలకు రూ.15 నుంచి రూ.20 వేలు అధికారులకు ముట్ట చెబుతున్నారు. ఇలా వారి ఇష్టం వచ్చినట్లు తోలుకోవడం, వారు చెప్పిన ధరకే విక్రయించడం జరుగుతోంది.



ఇటీవల గుడ్లూరు ఎస్సై పట్టుకుని స్టేషన్‌లో ఉంచిన పది ట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్ల వేగంతో ప్రమాదాలు, కష్టాలు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. ఇటీవల మాచవరం వద్ద ఇసుక ట్రాక్టర్ నుంచి త్రుటిలో ప్రమాదం తప్పింది. లింగసముద్రం తూనుగుంట వద్ద రైతులు పొలాల్లోకి ఏర్పాటు చేసుకున్న పైపులను సైతం ధ్వంసం చేసుకుంటూ ట్రాక్టర్లు తిరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులకు ఫోన్లు చేసినా స్పందించడం లేదు.

గుడ్లూరు పోలీసులు 100 ట్రాక్టర్లు పట్టివేత

ఇటీవల పది రోజులుగా గుడ్లూరు పోలీసులు ఇసుక రవాణా వాహనాలపై విస్తృత దాడులు చేస్తున్నారు. అయితే ఆ వాహనాలకు పదోపరకో జరిమానా విధించి వదిలేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని ప్రజలను నమ్మించేందుకే చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ వాళ్లకు చెందిన వాహనాలు అయితే వదిలిపెట్టడం లేదని తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ నేత సోదరుడిపై హత్యాయత్నం

- మునుగులు ధరించి దాడి చేసిన దుండగులు
- రాజకీయ కక్షపూరిత దాడిగా అనుమానిస్తున్న స్థానికులు



రక్తమోడుతున్న బాధితుడు మల్లికార్జున

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి పట్టణంలోని వేపకాయల మిల్లు యజమానిపై కొందరు వ్యక్తులు ముసుగులు ధరించి వచ్చి హత్యాయత్నంకు పాల్పడ్డారు. రక్తమోడేలా గాయపరిచి, గదిలోపల వేసి బయట తలుపు వేసి, గేటుకు చిలుకు పెట్టి పరారయ్యాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. స్థానికులు, బాధితుడి కథనం మేరకు.. కావలి పట్టణంలోని ఉత్తర శివార్లలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దామిశెట్టి శ్రీనివాసులునాయుడు కుటుంబానికి చెందిన వేపకాయ మిల్లు ఉంది. ఈ మిల్లు యజమానుల్లో ఒకరైన దామిశెట్టి మల్లికార్జున ప్రాంగణంలోనే తన విధుల్లో ఉండగా, ముసుగు ధరించి వచ్చిన వ్యక్తులు ఆయనపై మూకుమ్మడిగా దాడి చేశారు. చేతులతో కొట్టి, కాళ్లతో తన్నారు. తలపై తీవ్ర గాయాలు కావడంతో పాటు శరీరంపై రక్తపు గాయాలయ్యాయి. మల్లికార్జున రక్తమోడుతూ పడిపోవడంతో ముసుగు ధరించిన దుండగులు మిల్లు గేటు వేసి బయట చిలుకు పెట్టి వెళ్లిపోయారు. రక్తపు గాయాలతో ఉన్న బాధితుడు కావలిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. మల్లికార్జునపై హత్యాయత్నం వెనుక రాజకీయ కుట్రకోణం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్వతహాగా వ్యాపారం కార్యకలాపాలు తప్ప.. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటాడు. మల్లికార్జున సోదరుడు దామిశెట్టి శ్రీనివాసులునాయుడు, మరో సోదరుడు, కుమారుడు వైఎస్సార్‌సీపీ నేతలుగా ప్రత్యక్ష రాజకీయాల్లో చురుగ్గా ఉంటారు. దామిశెట్టి కుటుంబం ఆది నుంచి దివంగత మాజీమంత్రి కలికి యానాదిరెడ్డి శిష్యులు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరులుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. దామిశెట్టి శ్రీనివాసులునాయులు భార్య ఒకసారి ఎంపీపీగా, మరోసారి జెడ్పీటీసీగా వ్యవహరించగా, సోదరుడు పూర్ణచంద్రరావు ఎంపీపీగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఆ కుటుంబం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడుస్తోంది. దామిశెట్టి శ్రీనివాసులునాయుడు కుమారుడు దామిశెట్టి సుధీర్‌నాయుడు అయితే ఎన్‌డీసీసీబీ డైరెక్టర్‌గా, పార్టీలో కాపు నాయకుడిగా రాష్ట్ర స్థాయి పదవిలో కొనసాగుతున్నాడు. వ్యాపారం తప్ప.. రాజకీయ వ్యవహారాలు పట్టించుకోని మల్లికార్జునపై దాడి జరగడం వెనుక రాజకీయ కక్ష కోణం ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాగుంట పార్వతమ్మకు ఘన నివాళి



మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఆలింగనం చేసుకుని పరామర్శిస్తున్న బొత్స సత్యనారాయణ







పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విక్రమ్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు)/కావలి: దివంగత మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ చిత్రపటానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం నివాళులర్పించారు. మాగుంట పార్వతమ్మ ఇటీవల మృతి చెందగా, బుధవారం నెల్లూరులోని ఆమె నివాసంలో ఉత్తరక్రియలు నిర్వహించారు. మాగుంట కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని పరామర్శించారు. పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై నివాళులర్పించారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



విధ్వంసం, రౌడీయిజం

ఇదే వంద రోజుల కూటమి పాలన

- ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం.. ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యం
- పచ్చచొక్కాలను నమ్ముకుని ఖాకీలు పనిచేయొద్దు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి శంకరనగరంలో పర్యటన

సోమశిల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విధ్వంసాలు, అరాచకాలు, రౌడీయిజం పాలన సాగిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మద్దతుదారులపై దాడులు చేయడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైపోయిందన్నారు. బుధవారం ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి కాకాణి అనంతసాగరం మండలం శంకరనగరంలో పర్యటించారు. సర్పంచ్ పార్లపల్లి వరలక్ష్మి రవికుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిపై టీడీపీ నేతలు సాగించిన దాడులు, విధ్వంసాలు, పోలీసు కేసు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో కాకాణి మాట్లాడుతూ చంద్రబాబు ప్రమాణస్వీకారం రోజు శంకరనగరం సర్పంచ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులపై టీడీపీ మూకలు దాడులు చేశారన్నారు. వారిని వదిలేసి దాడికి గురైన వారిపై పోలీసులు కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారన్నారు. మూడు నెలల పాటు జైల్లో పెట్టారన్నారు. వృద్ధులు, చదువుకునే పిల్లలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై రౌడీషీట్లు ఎలా తెరుస్తారని ప్రశ్నించారు. పచ్చచొక్కాలను నమ్ముకుని ఖాకీలు ఇలాంటి అకృత్యాలకు పాల్పడితే మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇళ్లకే పరిమితమవుతారని, అప్పుడు శాశ్వతంగా పచ్చ చొక్కాలు తగిలించుకోవాల్సి వస్తుందని పోలీసులను హెచ్చరించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు సర్పంచ్ కుటుంబ సభ్యులు ఇచ్చిన కేసును నీరుగార్చి రౌడీషీట్లు ఓపెన్ చేశాం, ప్రతి ఆదివారం వచ్చి సంతకాలు పెట్టాలని వేధిస్తున్నారని, ఈ అధికారం మీకెవరిచ్చారని ప్రశ్నించారు. అధికారం మీ చేతుల్లో ఉందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ విధ్వంసాలపై తాను, మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఎస్పీని స్వయంగా కలిసి వివరిస్తామన్నారు. శంకరనగరంలో పరిస్థితిని మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఆయా కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారన్నారు. త్వరలోనే జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్నారని తెలిపారు. జిల్లాలో శిలాఫలకాలు, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, ఏ అధికారులు, ఏ నాయకులు వాటిని ధ్వంసం చేశారో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే మళ్లీ వారితో, వారి నిధులతో మళ్లీ కట్టించేలా చేస్తామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఏ నాయకుడికి ఇబ్బంది కలిగినా విక్రమ్‌రెడ్డితో కలిసి వారికి అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పేట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, కేతా రామకృష్ణారెడ్డి, అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, చింతంరెడ్డి కృష్ణారెడ్డి, బట్రెడ్డి నాగేంద్రరెడ్డి, నాగా నాగిరెడ్డి, పాలపాటి నాగార్జునరెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, అక్కలరెడ్డి నారాయణరెడ్డి, కాకూరు నారసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కక్షపూరిత రాజకీయాలు : మాజీ ఎమ్మెల్యే మేకపాటి

కూటమి ప్రభుత్వం గ్రామాల్లో కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. దాడికి గురైన వారిపైనే పోలీసులు కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. ఇదంతా నియోజకవర్గ ప్రజాప్రతినిధికి తెలిసే జరుగుతుందా అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థను వినియోగించుకుని ఒక కుటుంబానికి చెందిన ఇంత మందిపై కేసులు పెట్టడం, 18 ఏళ్లు కూడా నిండని వారిపై రౌడీషీట్లు తెరవడం, ఇదంతా కక్ష పూరితంగానే చేశారన్నారు. చేజర్లకు చెందిన ఓ నాయకుడు ఈ కేసును వెనుకుండి నడిపిస్తున్నారని తెలిసిందన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలను, కార్యకర్తలను ఇబ్బందులు పెడితే సహించేది లేదని, వారి కోసం ఎంత వరకైనా పోరాడుతామన్నారు. నియోజకవర్గంలో 6 లక్షల టన్నుల ఇసుక మాయమైందని, మట్టి సంగతి ఇక చెప్పాల్సిన అవసరం లేదన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న మాజీ మంత్రి కాకాణి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి

దసరా తర్వాతే 'ప్రైవేట్ మద్యం'

- దరఖాస్తుల దాఖలుకు గడువు పొడిగింపు
- 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు సమయం
- 14న లాటరీ, 16న షాపులు ప్రారంభం
- ఇప్పటి వరకు 2,533 దరఖాస్తుల దాఖలు



- డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాస రావు

నెల్లూరు (క్రైమ్): మద్యం దుకాణాల్లో పచ్చ మాఫియా కర్ఫ్యూ వేయడంతో నామమాత్రంగా దరఖాస్తులు దాఖలవుతున్నాయి. దీంతో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పారదర్శకత కలరింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు పొడిగిస్తూ మంగళవారం అర్ధరాత్రి జీఓ విడుదల చేసింది. 12, 13 తేదీల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను పరిశీలిస్తోంది. 14వ తేదీ ఉదయం కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించి దుకాణాలను కేటాయిస్తారు. దుకాణం దక్కించుకున్న వ్యక్తి వెంటనే రిటైల్ ఎక్సైజ్ పన్నులో ఆరో వంతు కిస్తీ చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం అధికారులు ప్రొవిజినల్ లైసెన్సు మంజూరు చేస్తారు. 16వ తేదీ నుంచి మద్యం విక్రయాలు సాగించవచ్చు. ఈ లెక్కన దసరా తర్వాతే ప్రైవేట్ మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తాయి.

బుధవారం వరకు 2,533 దరఖాస్తులు

దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరుగుతోందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు 'సాక్షి'కి వెల్లడించారు. బుధవారం వరకు జిల్లాలోని 182 మద్యం దుకాణాలకు 2,533 దరఖాస్తులు అందాయనీ, మరికొన్ని పరిశీలనలో ఉన్నాయన్నారు. ప్రతి స్టేషన్ ఎదుట ఏ షాపునకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో డిస్‌ప్లే చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్లలో నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

వ్యక్తులపై రాళ్లతో దాడి

నెల్లూరు(క్రైమ్): ఇద్దరిపై కొందరు రాళ్లతో దాడి చేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసును బుధవారం రాత్రి నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌జీనగర్ మూడో వీధిలో నివాసం ఉంటున్న అనూసింగ్ తన స్నేహితులైన వెంకటసాయికుమార్, చిరంజీవితో కలిసి ట్రంక్‌రోడ్డు మీదుగా మంగళవారం వెళ్తుండగా, బైక్ నడుపుతున్న ఓ బాలుడు వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో వీరికి గాయాలయ్యాయి. వేగంగా ఎందుకెళ్తున్నావని బాలుడ్ని ప్రశ్నించగా, తాను చికెన్ చాన్‌బాషా మనవడిని, మీ అంతుచూస్తానని బెదిరించి వెళ్లిపోయాడు. అనూసింగ్ అతని స్నేహితులు భోజనం చేసేందుకు రియాజ్ హోటల్ వైపు వెళ్తుండగా, లీలామహల్ సెంటర్ వద్ద బాలుడి తండ్రి సర్దార్ మరికొందరితో కలిసి వారిని అడ్డుకున్నారు. తన కుమారుడ్నే ప్రశ్నిస్తారానంటూ వారిపై రాళ్లతో విచక్షణరహితంగా దాడి చేశారు. ఘటనలో అనూసింగ్, సాయికుమార్ గాయపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వీరు చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులకు అనూసింగ్ ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు: ఎలాంటి అనుమతి పత్రాల్లేకుండా బొగ్గేరు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆత్మకూరు పరిధిలోని సోమశిల రోడ్డు మార్గంలో పట్టుకున్నామని ఎస్సై జిలానీ తెలిపారు. దేపూరు నుంచి ఇసుకను అక్రమంగా లోడ్ చేసుకొని వస్తుండగా, బుధవారం తెల్లవారుజామున పట్టుకొని కేసు నమోదు చేశామని వివరించారు.

నర్రవాడలో బహిరంగ వేలం



దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో పనికిరాని ఇనుప, ప్లాస్టిక్ సామగ్రి, నిల్వ ఉన్న బియ్యం, గోశాలలో పోగుచేసిన ఎరువులకు సంబంధించిన బహిరంగ వేలాన్ని బుధవారం నిర్వహించారు. ఇనుప సామగ్రి కిలోను రూ.28 చొప్పున నూతంగి రామకృష్ణ.. ప్లాస్టిక్ డబ్బాలను కిలో రూ.ఏడు చొప్పున పసుపులేటి అశోక్.. బియ్యం కిలోను రూ.36 చొప్పున పరమేశ్వరరావు, గోశాల వద్ద పోగుచేసిన ఎరువును రూ.82 వేలకు వెంకటసుబ్బయ్య దక్కించుకున్నారు. ఈఓలు ఉషశ్రీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 264
లేయర్ చికెన్	: 187



సైబర్ ఉచ్చులో సామాన్యులు

ఆన్‌లైన్ మోసాలతో కూలుతున్న కాపురాలు

- రకరకాల పేర్లతో నిలువు దోపిడీ
- చేతులెత్తేస్తున్న పోలీస్ యంత్రాంగం

➡ షేర్ మార్కెట్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ కావలికి చెందిన ఓ గృహిణి వాట్సాప్ నంబర్‌కు జూలైలో మెసేజ్ వచ్చింది. నిఫ్టీ, ఆప్షన్ ట్రేడింగ్ ద్వారా రోజూ రూ.10 వేల వరకు సంపాదించొచ్చని, అవగాహన కోసం యూట్యూబ్ వీడియో లింక్‌లనూ పంపారు. దీంతో నిజమని భావించిన ఆమె వారు సూచించిన టెలిగ్రామ్ గ్రూపులో చేరి పెట్టుబడులు పెట్టారు. రెండు, మూడు రోజులు వరుసగా లాభాలు చూపించాక, పెట్టుబడి పేరుతో విడతల వారీగా నెల వ్యవధిలో రూ.40 లక్షల వరకు దోచేశారు. అనంతరం టెలిగ్రామ్ ఖాతాను వారు డిలీట్ చేయడంతో బాధిత మహిళ ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బు, బంగారాన్ని కుదువపెట్టి తెచ్చిన నగదుతో పాటు రూ.10 లక్షల వరకు అప్పులు చేసి మోసగాళ్ల మాయలో పడ్డామని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

➡ కావలికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని రూ.20 లక్షల వరకు పోగొట్టుకున్నారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు, క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా బిట్ కాయిన్ మైనింగ్ పేరుతో వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించడంతో సైబర్ ముఠాలు నకిలీ యాప్‌లు పంపి లాభాలు చూపాయి. విత్‌డ్రా చేసుకోవాలంటే సెక్యూర్టీ డిపాజిట్, జీఎస్టీ, క్రిప్టోకరెన్సీపై షార్ట్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్, ఆదాయ పన్ను శాఖకు ముందుగానే చెల్లించాల్సిన టీడీఎస్ అంటూ సుమారు రూ.20 లక్షల వరకు దోచేశారు. ఆపై నంబర్‌ను బ్లాక్ చేయడంతో బాధితుడు లబోదిబోమంటున్నారు. వృత్తిరీత్యా బెంగళూరులో ఉంటున్న బాధితుడు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా, సైబర్ నేరగాళ్లు కంబోడియాలో ఉంటూ మోసాలకు పాల్పడుతున్నారని గుర్తించి దర్యాప్తు చేపట్టారు.

కావలి / బిట్రగుంట: సైబర్ నేరగాళ్లు రోజుకో తరహాలో రెచ్చిపోతున్నారు. డిజిటల్ అరెస్ట్‌లు.. ఓటీపీ మోసాలు.. న్యూడ్ వీడియో కాల్స్ చేసి స్క్రీన్‌షాట్ తీయడం ద్వారా బెదిరింపులతో పాటు పెట్టుబడుల పేరుతో నయా మోసాలకు తెరదీస్తూ కోట్లు కొల్లగొడుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో తప్పుదోవ పట్టించేలా ప్రకటనలతో అమాయకులు, గృహిణులకు గాలమేస్తున్నారు. షేర్ మార్కెట్, క్రిప్టోకరెన్సీలో పెట్టుబడుల ద్వారా రోజూ రూ.మూడు వేల నుంచి రూ.పది వేల వరకు ఆదాయం సంపాదించొచ్చంటూ ఆకర్షణీయమైన సందేశాలు పంపుతున్నారు.

దర్యాప్తు కష్టమే

సైబర్ నేరాలపై సమర్థంగా దర్యాప్తు చేసే సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన టెక్నికల్ సిబ్బంది పోలీస్ శాఖలో లేకపోవడంతో నేరస్తులు రెచ్చిపోతున్నారు. కంబోడియా, శ్రీలంక, నేపాల్ తదితర దేశాల్లో ఉంటూ ఇక్కడ మోసాలకు పాల్పడుతున్నారు. ఉద్యోగాల పేరుతో ఆయా దేశాలకు వెళ్లి సైబర్ ముఠాలకు చిక్కుతున్న తెలుగు వారితోనే ఫోన్లు చేయిస్తున్నారు. కమీషన్ పద్ధతిలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్లు తదితరుల బ్యాంక్ ఖాతాలను సేకరించి వీటి ద్వారా లావాదేవీలు చేస్తున్నారు. బ్యాంక్ ఖాతాలు, ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టినా, కమీషన్లకు ఆశపడి ఖాతాలిచ్చిన వారే దొరుకుతున్నారే తప్ప అసలు నిందితులు చిక్కడంలేదు. సైబర్ నేరాల్లో కనీసం ఐదు శాతం రికవరీ సైతం ఉండటం లేదు.



డిజిటల్ అరెస్ట్ దందా..

డిజిటల్ అరెస్ట్ పేరుతో సరికొత్త మోసానికి నేరగాళ్లు తెరలేపారు. సీబీఐ, ఈడీ, సైబర్ క్రైమ్, ఏటీఎస్, నార్కొటిక్స్, ఏసీబీ అంటూ ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతారు. మీ పేరుపై డ్రగ్స్ పార్సిళ్లు వచ్చాయని.. ఉగ్రవాదుల బ్యాంక్ ఖాతాల నుంచి మీ ఫోన్‌పేకు డబ్బులొచ్చాయని లేదా నిషేధిత చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు చూస్తున్నారంటూ బెదిరిస్తారు. అరెస్ట్ వారెంట్ జారీ అయిందంటూ నకిలీ పత్రాలను వాట్సాప్‌లో పంపి దడ పుట్టిస్తారు. వీడియో కాల్‌లో విచారణ పేరుతో కొన్ని రోజుల పాటు ఉక్కిరిబిక్కిరి చేసి బ్యాంక్ ఖాతాల్లోని డబ్బును కొల్లగొడతారు. ఏసీబీ అధికారుల పేరుతో చేజర్ల తహసీల్దార్‌కు.. సీబీఐ, ఈడీ అధికారుల పేరుతో మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డికి సైబర్ నేరగాళ్లు ఉచ్చు వేసిన విషయం తెలిసిందే.

ఆధార్ అనుసంధానం పేరిట

బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లేదా పాన్‌కార్డును అనుసంధానించకపోతే ఖాతాను బ్లాక్ చేస్తామంటూ వాట్సాప్‌లో మాల్‌వేర్‌తో కూడిన నకిలీ యాప్‌లను పంపుతారు. ఇవి అచ్చం బ్యాంక్ యాప్స్ తరహాలోనే ఉంటాయి. ఇన్‌స్టాల్ చేసిన వెంటనే బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలతో పాటు ఫోన్ కాంటాక్ట్స్, ఎస్సెమ్మెస్‌లు నేరస్తుల చేతికి అందుతుంటాయి. వీటి ఆధారంగా ఖాతాల్లోని నగదును కొల్లగొడతారు.

అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, ఏసీబీ అధికారులమంటూ ఎవరైనా కాల్ చేస్తే నమ్మొద్దని ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సాంకేతికతను వినియోగించి సైబర్ నేరగాళ్లు నేరాలకు యథేచ్ఛగా పాల్పడుతున్నారని చెప్పారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు తిరిగి అకౌంట్లలో 48 గంటల్లో జమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల బారినపడిన వారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సైబర్ మిత్ర వాట్సాప్ నంబర్ 91212 11100, 1930 లేదా cybercrime.gov.inకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నమ్మితే.. నిలువుదోపిడీయే

యూట్యూబ్‌లో నకిలీ చానళ్లను ఏర్పాటు చేసి అచ్చం ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల తరహాలో నకిలీ వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. వీటిని నమ్మి వీరి ఉచ్చులో పడితే నిలువు దోపిడీ చేస్తున్నారు. తొలుత రూ.ఐదు వేలు, రూ.పది వేలను పెట్టుబడుల రూపంలో తీసుకొని ఒకట్రెండు రోజుల్లోనే రెట్టింపు ఆదాయం చూపుతున్నారు. దీంతో బాధితులు నమ్మి అధిక మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. ఉదాహరణకు రూ.లక్షను పెట్టుబడిగా పెడితే కొన్ని గంటల్లోనే రూ.50 వేల అదనపు ఆదాయాన్ని చూపుతున్నారు. లాక్ ఇన్ పీరియడ్ పేరుతో విత్‌డ్రాకు అవకాశం లేకుండా చేస్తూ, కనీసం రూ.ఐదు లక్షలైనా ఇన్వెస్ట్ చేయాలంటూ బాధితుడి మానసిక స్థితిని బట్టి డిమాండ్ చేస్తున్నారు. రూ.ఐదు లక్షలు పెట్టుబడి పెట్టాక మరికొంత.. మరికొంత అంటూ చివరి పైసా వరకూ లాగేసి నంబర్లు బ్లాక్ చేస్తున్నారు. గడిచిన 30 రోజుల్లో పట్టణంలోని పదుల సంఖ్యలో గృహిణులు, యువత, వ్యాపారులు ఈ తరహా మోసాల బారిన పడి భారీగా నష్టపోయారని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదనే భావనతో, ఎవరూ ముందుకు రావడం లేదు.



ఎక్స్‌రే గది వద్ద నిరీక్షిస్తున్న రోగులు

పెద్దాస్పత్రిలో విద్యుత్‌కు వెతలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. బుధవారం సైతం సుమారు రెండు గంటల పాటు ఇదే సమస్య తలెత్తింది. నాలుగు రోజుల ముందూ ఇదే పరిస్థితి నెలకొంది. చుట్టుపక్కల విద్యుత్ ఉన్నా, ఆస్పత్రిలో మాత్రం ఉండటంలేదు. ఎక్కడో ఒక చోట ఫ్యూజులు ఎగిరిపోతున్నాయి. జనరేటర్ ఉన్నా, ఫ్యాన్లు, లైట్లే పనిచేస్తున్నాయి. మరో వైపు ఎక్స్‌రే, సీటీ, ఎమ్మారై, అల్ట్రా సౌండ్ స్కాన్ లాంటి పరీక్షలు ఆగిపోతున్నాయి. దీంతో రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్స్‌రే లాంటి చోట్ల పేర్లు కూడా నమోదు చేసుకోవడం లేదు. దీంతో కరెంట్ వచ్చాక ఒకేసారి పెద్ద ఎత్తున రద్దీ ఏర్పడి పరిస్థితి గందరగోళంగా మారుతోంది. కాగా ఈ విషయమై పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌ను సంప్రదించగా, విద్యుత్ అధికారులతో మాట్లాడామని, లోపాలను సవరిస్తున్నామని బదులిచ్చారు.

ఖోఖో టోర్నీలో విజయమే లక్ష్యంగా

- రాష్ట్ర జట్టుకు నెల్లూరులో తర్ఫీదు
- ఏసీ స్టేడియంలో రోజూ శిక్షణ
- 16 నుంచి కోయంబత్తూరులో పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సౌత్‌జోన్ ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర అండర్ - 14, 17 బాలికల జట్ల శిక్షణకు నెల్లూరు వేదికైంది. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులకు ఉదయం, సాయంత్రం వేళ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ఈ నెల 14 వరకు కొనసాగనుంది. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న సౌత్‌జోన్ ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు.

పాల్గొననున్న క్రీడాకారులు

- అండర్ - 14 విభాగంలో భరణి, గౌసున్నీసా (నెల్లూరు), హారిక, చందన (శ్రీకాకుళం), యువశ్రీ (చిత్తూరు), ధనలక్ష్మి, హారిక (విజయనగరం), హేమలత, ఐశ్వర్య, గురవమ్మ (ప్రకాశం), మున్నీసా (గుంటూరు), హరిత (వైఎస్సార్), జ్ఞానలక్ష్మి (తూర్పుగోదావరి), కావేరి (అనంతపురం), వినీషా (కృష్ణా), హారిక (కర్నూలు).
- అండర్ - 17 విభాగంలో పవిత్ర, స్రవంతి (నెల్లూరు), జాహ్నవి (విజయనగరం), పురందేశ్వరి, సుస్మిత (ప్రకాశం), స్వప్న (అనంతపురం), తనూజ, భవానీ, తేజశ్రీ (శ్రీకాకుళం), అర్చనశ్రీ (కర్నూలు), స్రవంతి (కడప), యశ్విత, మణిచంద్రిక (తూర్పు గోదావరి), అనిత (కృష్ణా), రంగమహాలక్ష్మి (గుంటూరు), జ్యోత్స్న (విశాఖపట్నం), సత్యవతి (చిత్తూరు).



శిక్షణ పొందుతున్న క్రీడాకారులు



ఉత్సాహంగా..

ఉత్తమ శిక్షణ ఇస్తున్నాం



రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి క్రీడాకారుల శిక్షణ పొందుతున్నారు. ఒక్కో క్రీడాకారుణిని దృష్టిలో ఉంచుకొని శిక్షణ ఇస్తున్నాం. ఫిట్‌నెస్‌తో పాటు స్కిల్స్, గేమ్‌ను రోజూ పర్యవేక్షిస్తున్నాం. ఉత్తమ శిక్షణను అందజేస్తున్నాం. సౌత్‌జోన్ పోటీల్లో రాష్ట్ర జట్టు మంచి ఫలితాలను సాధిస్తుంది.

– సుకుమార్, ఖోఖో కోచ్

ప్రణాళికబద్ధంగా..



క్యాంపును ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్నాం. వసతి, భోజనం, ఆరోగ్యపరమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఉత్తమ ప్రమాణాలతో శిక్షణను అందిస్తున్నాం. రానున్న రోజుల్లో ఉత్తమ క్రీడాకారులుగా వీరు తయారవుతారు. ఖోఖో రాష్ట్ర జట్టుకు నెల్లూరులో శిక్షణా శిబిరాన్ని నిర్వహించడం హర్షణీయం.

– యతిరాజ్, క్యాంప్ పరిశీలకుడు, డీఎస్డీఓ

నిర్వహణలో రాజీపడేది లేదు



ప్రస్తుత రోజుల్లో క్యాంపులు నిర్వహించడం వ్యయప్రయాసలతో కూడిన పని. అయినా ఎక్కడా రాజీ పడకుండా నిర్వహిస్తున్నాం. వసతి, భోజన సదుపాయాలను ఉచితంగా అందిస్తున్నాం. క్రీడాకారులకు భోజనాన్ని అందజేయడంలో సహాయ, సహకారాలను కిరణ్స్ స్మైల్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అందిస్తున్నారు.

– గిరిప్రసాద్, క్యాంప్ డైరెక్టర్, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: టీడీపీ పాల్పడే దుశ్చర్యలకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని తోటలచెరువులో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని కార్యకర్తలు, నేతలతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.

వైఎస్సార్ విగ్రహానికి జరిగిన అవమానాన్ని ప్రజలకు తెలియజేసేందుకు గానూ గ్రామానికి వచ్చానని వివరించారు. రాష్ట్ర ప్రజలు మర్చిపోలేని విధంగా వైఎస్ రాజశేఖరరెడ్డి మేలు చేశారని, అలాంటి వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆయన ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ తదితర పథకాలను ప్రజలు మరువ లేరని చెప్పారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ అలీ అహ్మద్, మండల కన్వీనర్ మందలపు తిరపతినాయుడు, సర్పంచ్ పెద మౌలాలీ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఎర్ర ఓబయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్లు, కలిగిరి జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రి, పల్లాల కొండారెడ్డి, కండ్లకుంట వెంకటరెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ముల్లంగి శ్రీధర్, శ్రీనివాసులు, మాధవ, మాల కొండయ్య, బత్తిని కొండమ్మ, చెనికల ఆవులయ్య, కుమ్మిత ప్రతాప్‌రెడ్డి, రాయవరపు మధుసూదన్‌రావు, దారపనేని చెన్నారాయుడు, మేడసాని చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేకపాటి

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30



BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No.31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

OA 1176 of 2022

Between:
Canara Bank, Lingasamudram Branch,
Rep. by its Branch Manager ...Applicant Bank
And:
Karanam Krishnaiah and another ...Defendants

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To
D.1. Karanam Krishnaiah, S/o. Narasaiah, Hindu, aged 69 years, Cheemalapenta Village, Lingasamudram Mandal, Prakasam District, Andhra Pradesh.
D.2. Karanam Mohan Rao, S/o. Malakondaiah, Hindu, aged 39 years, Cheemalapenta Village, Lingasamudram Mandal, Prakasam District, Andhra Pradesh.

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of debts due to banks and Financial Institutions Act, 1993 against you for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 am or at such time immediately thereafter according to the convenience of Tribunal on 14-11-2024 to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader/Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and seal of the Tribunal on this the 19th day of August, 2024 At Visakhapatnam.
Signature of Assistant Registrar
Debts Recovery Tribunal Visakhapatnam.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ B.Tech, B.Sc, BCA, BBA, B.Com, BA, BLisc, MBA, MCA, M.Sc, M.Com, MA, MLisc, Ph.D, 10th, Inter. Cell : 80080 10144. [NA-5440]

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/lateral entry. 9381287629 [T-2328]

REAL ESTATE

PLOT FOR SALE

■ దసర ఆఫర్ : నెల్లూరుసిటీ, గూడూరులో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు Ready గా ఉన్న మా లేఅవుట్‌లో లోను వసతి మరియు ఫ్రీ రిజిస్ట్రేషన్ ఆఫర్‌తో ప్లాట్లు అమ్మబడును. 79954 34866. [NA-23745]

■ నెల్లూరుకు దగ్గరలో నరుకూరు సెంటర్‌లో DTCP ప్లాట్స్ అంకణం 80వేలు, NUDA Approved ప్లాట్స్ 90వేలకే అమ్మబడును. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సెల్: 6281411178, 9121452347. [NA-6630]

■ కేవలం 5లక్షలకే హైవే దగ్గర ప్లాటు మొదటి 5 మందికి 70గ్రా గోల్డ్ ఫ్రీ. కొద్దిప్లాట్లు కలవు. వివరములకు సంప్రదించండి: 88860 60049. [NA-1256651]

TO-LET

■ నెల్లూరు సుబేదారుపేట, మెయిన్‌రోడ్, మధుర స్వీట్స్ ప్రక్కన గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోర్ మొత్తం 2350Sft బ్యాంకులకు, షోరూంలకు మరియు ఆఫీసులకు, పార్కింగ్ సౌకర్యంతో బాడుగకు ఇవ్వబడును. (No Mediators Allowed) సంప్రదించండి: Land Lord - 8500094888. [N-1253765]

WANTED

■ Wanted Female Telecellers For Banking Process @ Nellore Near RTC. Fixed Salary + Bonus Cum Incentives. Contact: 91333 13939. [NA-755]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185469]

ప్రకటన గోరంత స్పందన కొండంత

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ (పు/స్త్రీ) కావలెను. నెలకు పదివేలు నుండి లక్ష రుపాయలు సంపాదించే సువర్ణవకాశం. 72072 66366. [NA-6617]

■ అనుభవం కలిగిన మ్యారీడ్ లేడీ టెలికాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వబడును. వివరాలు ఆఫీసులో మాత్రమే తెలియజేయబడును. నెల్లూరు. సెల్: 93927 97088. [NA-6636]

■ నెల్లూరు, హరనాథపురం మెయిన్‌రోడ్‌లో AMR పెట్రోల్ బంకు నందు నైట్‌షిఫ్ట్‌లో పని చేయుటకు యువకులు కావలెను. జీతం: 13,000/-. సంప్రదించండి : 8985264143, 9494797343. [NA-6635]

■ ఇంటిలో పనిచేయుటకు ఆడ పనివారు కావలెను. పనివేళలు ఉదయం 9 నుండి 2 గంటల వరకు వయస్సు: 20 నుండి 35 లోపు వారు. బాలాజీనగర్ - నెల్లూరు. సంప్ర: 93461 64219. [NA-693]

■ లోటస్ హాస్పిటల్ నందు పని చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు PROలు గా ఆపరేషన్ థియేటర్ స్టాఫ్ మరియు వార్డు బాయిస్ కావలెను. పొగతోట, నెల్లూరు. 91212 82909. [NA-695]

■ KCS జాబ్ సర్వీసెస్ నందు పని చేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను Qlf: B.Com Computers మరియు నెల్లూరు Bit-2 వారికి ప్రాధాన్యత . సంప్ర: 93461 64219. [NA-692]

■ Bank of India & Union Bank నందు Advisors, Agency Leaders కావలెను. Age: 25 సం, ఆపైన, Qlf : Any Degree. గృహిణిలకు, రిటైరైన వారికి ప్రాధాన్యత. Salary: 10k. 94903 28129. [NA-23740]

■ 100% జాబ్ గ్యారెంటీ : MS Office, DTP, Tally, GST కోర్సులలో ట్రైనింగ్ ఇచ్చి 100% జాబ్ చూపించబడును. Contct: Ganesh Computer Education, Nellore. Cell : 8885915911. [NA-6631]

■ JVR షాపింగ్‌మాల్, కోమలవిలాస్ దగ్గర ట్రంకురోడ్డు, నెల్లూరు నందు క్యాషియర్స్ & కిడ్స్‌వేర్, డ్రెస్ మెటీరియల్ సెక్షన్స్‌లో పని చేయుటకు సేల్స్‌గర్ల్స్, సేల్స్ బాయ్స్, హెల్పర్స్ కావలెను. నేరుగా సంప్రదించండి. [NA-751]

■ రుక్మిణి సిల్క్స్, కాపువీధి, నెల్లూరు నందు కిడ్స్ వేర్, డ్రెస్ మెటీరియల్ సెక్షన్స్‌లో పని చేయుటకు సేల్స్ గర్ల్స్, సేల్స్ బాయ్స్, హెల్పర్ కావలెను. & కస్టమర్ రిసీవింగ్ లేడీస్ కావలెను. నేరుగా సంప్రదించండి. [NA-747]

■ VSN ఎంటర్‌ప్రైజెస్: మేనేజర్ (exp. 3సం॥) డెలివరీ స్టాఫ్, ఆఫీస్ అసిస్టెంట్ (F) 1+4 yrs, గోడౌన్ ఇన్‌ఛార్జ్ (1-4 yrs), సూళ్ళూరుపేట. ✆ 8341622655, 9581814787 [G-276]

■ గూడూరు ప్రముఖ దంత వైద్యశాల నందు పనిచేయుటకు 10th, ఇంటర్ చదివిన స్త్రీ/పురుషులు కావలెను. ✆ 9390120166 [C-800094]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024, 9640400073 [H-796284]

■ రాళ్ళ పై పేర్లు చెక్కే వారు మరియు పెయింట్ వర్క్స్ చేయు వారు కావలెను. ఫోన్ నంబరు. 9182966155 [HA-5024]

■ కష్టలేనిది కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీరూం+భోజనం. HYD. 8317512135 [HA-98696]

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు నెల్లూరు, నార్త్ రాజుపాలెం, నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో లేడీ గార్డ్ 12గం॥ రూ. 14,000, జంట్ గార్డ్ 8గం॥ రూ.12,000 (ఫుడ్ రూం ఉచితం) అర్జెంట్‌గా కావలెను. సెల్: 99089 54793, 91103 39912. [N-1253732]

■ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, నెల్లూరు జిల్లాలో పని చేయుటకు MBA/ డిగ్రీ అర్హత కల్గిన 29 సం॥ల యువకులు కావలెను. జీతం : 17,000 + ఇన్సెంటివ్ + టూ వీలర్ మస్ట్. Venkatasureshbabu.r@shriramfinance.me. సంప్ర : 80088 02378, 97051 98381. [NA-1027]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రమరించబడవు.

